03-03-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మిమ్మల్ని సత్యాతి-సత్యమైన వైష్ణవులుగా తయారుచేయడానికి బాబా వచ్చారు, మీరు ఇప్పుడు ట్రాన్స్ఫర్ అయి నల్లగా ఉన్నవారి నుండి తెల్లగా అవుతున్నారు"

ప్రశ్న:- సర్వుల కామనలను పూర్తి చేసే పిల్లలైన మీ టైటిల్ ఏమిటి, మీరు ఏ కామనలను పూర్తి చేయాలి?

జవాబు:- మీరు సర్వుల మనోకామనలను పూర్తి చేసే జగదంబ పిల్లలైన కామధేనువులు. మాకు ముక్తి-జీవన్ముక్తి లభించాలని అందరికీ కామన ఉంది. కావున జగదంబ-జగత్పితల పిల్లలైన మీరు, అందరికీ ముక్తి-జీవన్ముక్తుల మార్గాన్ని తెలియజేస్తూ ఉండండి, ఇదే మీ పని.

గీతము:- అంబా, నీవు జగదంబ... (అంబే తూ హై జగదంబే...)

ఓంశాంతి. ఇది మమ్మా కోసం భక్తులు చేసిన మహిమ. భక్తులను రక్షించేవారు అని అంటారు. ఇప్పుడిది భక్తి మార్గం అయింది. మమ్మా మహిమ, శివబాబా తర్వాత ఉంటుంది. ఎప్పుడైతే పరమపిత పరమాత్మ శివ్ వస్తారో, అప్పుడు జగదంబను రచిస్తారు. రచించడము అంటే అర్థము ట్రాన్స్ఫర్ చేయడము. నల్లగా ఉన్నవారిని తెల్లగా చేస్తారు. ఈ సమయంలో జగదంబ అయితే ఒక్కరే. ఎలాగైతే శివుని చిత్రం ఒక్కటే, కానీ వారికి భిన్న-భిన్న పేర్లు పెట్టి, భిన్న-భిన్న మందిరాలను తయారుచేసారు. అనేక రకాలుగా మహిమను కూడా చేస్తారు. పరమపిత పరమాత్మ ఒక్కరే. అలాగే, జగదంబ కూడా ఒక్కరే. వారు రెండు భుజాలు కలవారు. 8 భుజాలు కలిగిన దేవీ-దేవతలు ఎవరూ ఉండరు. ప్రజాపిత మరియు జగదంబ కూడా రెండు భుజాలు కలవారు. జగదంబకు మహిమ ఎక్కువగా కలకత్తాలో ఉంది. కలకత్తా కాళీ ప్రసిద్ధమైనవారు. వారి చిత్రాన్ని కూడా చాలా భయంకరంగా తయారుచేసారు. పుర్రెల మాల కూడా ధరిస్తారు. ఇదంతా భక్తి మార్గము. జగదంబ అయితే బలి తీసుకోలేరు. వారైతే జగత్తును రచించేవారు. వారు బలిని ఎలా తీసుకోగలరు అనగా వారు మాంసాహారి ఎలా అవ్వగలరు? వారి మందిరాలు కేవలం కలకత్తాలోనే కాదు, కానీ చాలా చోట్ల ఉన్నాయి. మాత తన పిల్లలను ఏమైనా బలి తీసుకుంటారా. భక్తి ఎంత కఠినమైనది. జగదంబకు ఇంత భయంకరమైన రూపం ఉండదని, ఇటువంటి బలిని తీసుకోరు అని ఇప్పుడు వారికి ఎవరైనా కూర్చొని అర్థం చేయించాలి. వారిలో కూడా ఒకరు వైష్ణవ దేవి, మరొకరు మాంసాహారి. ఇప్పుడు ఎవరైతే మాంసాహారిగా ఉన్నారో, వారు వైష్ణవ్ గా అవుతారు. మమ్మా అయితే కుమారి, బహుశా వారు ఏమి తిని ఉండకపోవచ్చు కూడా. జగదంబ బ్రహ్మ పుత్రిక, వారు కుమారి. ఇప్పుడు కుమారిని మళ్ళీ అంబ అని ఎలా అంటారు, ఇది అర్థం చేసుకోవాల్సిన విషయము. కలకత్తాలో చాలా పూజ జరుగుతుంది. చాలా భయంకరమైన ముఖమును తయారుచేసారు. జగదంబకు అయితే ఇలాంటి ముఖము ఉండదు. వారు సర్వుల మనోకామనలను పూర్తి చేసేవారు. వారు సత్యాతి-సత్యమైన వైష్ణవ దేవి. వారి పూర్వ జన్మలో తప్పకుండా మాంసాహారి అయి ఉండవచ్చు. మళ్ళీ వైష్ణవ అనగా పావన దైవీ గుణాలు కలవారిగా తయారవుతున్నారు. ఇదంతా సంగమయుగం యొక్క విషయము. కావున జగదంబ మందిరానికి వెళ్ళి మహిమ చేయాలి. నిరాకార ఆత్మల తండ్రి కూడా ఒక్కరే అని మొదట తెలియజేయాలి. ఆ తర్వాత సాకార ప్రజాపిత బ్రహ్మ కూడా ఒక్కరే. బ్రహ్మ పుత్రిక అయిన సరస్వతి కూడా ఒక్కరే, వారు ఎప్పుడూ బలి మొదలైనవి తీసుకోరు. మొదట సుందరంగా ఉండేవారు, ఇప్పుడు నల్లగా ఉన్నారు, మళ్ళీ సుందరంగా అవుతారు. అప్పుడు మొత్తం కుటుంబం కూడా సుందరంగా అయిపోతుంది. చాలా స్థానాలలో అంబను రెండు భుజాలు కలవారిగానే చూపిస్తారు. అర్థం చేయిస్తే, కొందరు అర్థం చేసుకుంటారు కూడా, మరి కొందరు గొడవ కూడా చేస్తారు. హంగామా చేయడానికి ఆలస్యం చేయరు. కనుక అర్థం చేయించడంలో చురుకుగా ఉండాలి.

పిల్లలైన మీరు కళ్యాణకారులు. మమ్మా మొదట కలకత్తాకు వెళ్ళి ఉండవచ్చు కానీ ఇలాంటి మురళి నడవలేదు. జగదంబ ఒక్కరే. కుమార్తెలు అయిన మీరు అనేకానేకమంది ఉన్నారు. పేరు అయితే ఒక్కరిదే ఉంటుంది కదా. ఒక్కరికే అనేక మందిరాలను తయారుచేసారు. ఇప్పుడు కలకత్తాలో భక్తులను ఈ పూజ నుండి విడిపించడం ఎలా? వారిని కూడా పూజ్యులుగా అయితే చేయాలి కదా! కనుక అక్కడకు వెళ్ళి ఎవరైనా అర్థం చేయించాలి. ఈ సమయంలో అందరి మనోకామనలను పూర్తి చేసే ఆ జగదంబ కూర్చుని ఉన్నారు. వారు కామధేనువు. ఏ విధంగా వారు కామనలను పూర్తి చేస్తారు, ఇది ఎవ్వరికీ తెలియదు. మీరు కామధేనువైన జగదంబకు కుమార్తెలు. కేవలం గోమాతనే కాదు, పురుషులు కూడా ఉన్నారు. వారు కూడా చాలామంది కామనలను పూర్తి చేస్తారు. అందరి మనోకామనలను పూర్తి చేయడమే మీ

పని. అక్కడక్కడ సోదరులు కూడా సెంటర్లను నడుపుతారు. మేము కూడా అందరి మనోకామనలను పూర్తి చేయాలి అనగా ముక్తి-జీవన్ముక్తి యొక్క మార్గాన్ని తెలియజేయాలి, స్వర్గ వారసత్వం ఇవ్వాలని వారి బుద్ధిలోకి వస్తుంది. ఎవరైతే కల్పక్రితం తీసుకున్నారో, వారే తీసుకుంటారు. అయితే, అక్కడ అన్ని రకాల సుఖాలు లభిస్తాయి. జగత్ పిత, జగదంబ, ఈ ఇరువురి రచయిత శివబాబా. వీరి ద్వారా ఎన్ని మనోకామనలు పూర్తి అవుతాయి. కలకత్తాలో చాలా పూజ జరుగుతుంది. ఒకరు ఒకరిని, మరొకరు ఇంకొకరిని నమ్మేవారిగా ఉంటారు. కొందరు, వైష్ణవ దేవిని నమ్మేవారు కూడా ఉంటారు. వారు మీ మాటలతో వెంటనే రాజీ అవుతారు. వారికి చెప్పండి, మీకు రాజ్యభాగ్యము ఈ జగదంబ నుండి లభించింది అని. మరి జగదంబకు ఎక్కడ నుండి లభించింది? జగత్పిత నుండి. వారికి ఎక్కడ నుండి లభించింది? శివబాబా నుండి. వారు మొత్తం సృష్టికి రచయిత. మీరు మంచి రీతిలో అర్థం చేయించవచ్చు. జగదంబను అందరూ నమ్ముతారు. తప్పకుండా జగదంబ మరియు జగత్పితలకు కూడా వారసత్వం శివబాబా నుండే లభిస్తుంది, మళ్ళీ వారి ద్వారా పిల్లలకు లభిస్తుంది. జగదంబ ఒక్కరే, వారు రెండు భుజాలు కలవారు, వారికి అనేక భుజాలు లేవు. బ్రహ్మా పుత్రిక అయిన సరస్వతి జ్ఞాన-జ్ఞానేశ్వరి, కానీ వారి రూపాన్ని భయంకరంగా చూపించారు. కావున జగదంబది ఇటువంటి భయంకరమైన రూపం కాదు అని అర్థం చేయించాల్సి ఉంటుంది. సతోప్రధాన మనుష్యుల నుండి మళ్ళీ తమోప్రధానులుగా అవుతారు. తమోప్రధాన మనుష్యులు మళ్ళీ సతోప్రధాన మనుష్యులను పూజిస్తారు. జగదంబ మనిషే, ఎందుకంటే జగత్తు అయితే ఇక్కడ ఉంది. మూలవతనాన్ని, సూక్ష్మవతనాన్ని జగత్తు అని అనరు. సూక్ష్మవతనంలో దేవతలు ఉంటారు, మూలవతనంలో ఆత్మలు ఉంటాయి. కావున, ఈ విషయాలన్నీ అర్థం చేయించాల్సినవి. ఇకపోతే, తండ్రి మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి. 84 జన్మల కథను భారతవాసులకే వినిపించాల్సి ఉంటుంది. ఎవరైతే దేవతలుగా ఉండేవారో, వారిప్పుడు లేరు. దేవీ-దేవతల పూజారులు ఎవరైతే ఉంటారో, వారే ఈ విషయాలన్నింటినీ అర్థం చేసుకుంటారు. వారు మళ్ళీ ఉన్నత పదవిని ప్రాప్తి చేసుకునేందుకు కృషి కూడా చేస్తారు. చాలా మంది పిల్లలు ఏమనుకుంటారంటే, మేమైతే బాబా పిల్లలుగా అయిపోయాము, తప్పకుండా ఉన్నత పదవిని పొందుతాము అని. కానీ ఆలోచించండి, ముందు తప్పకుండా బాగా చదువుకుంటే ఉన్నత పదవిని పొందుతారు. చదువుకోకుండా, ఇంకా వికర్మలను చేస్తూ ఉన్నట్లయితే, ఒకటి, శిక్షలను తినాల్సి ఉంటుంది, రెండు, ఇక వెళ్ళి నౌకర్లుగా, దాస-దాసీలుగా అవుతారు ఎందుకంటే వికర్మల భారము చాలా ఉంది. జన్మ-జన్మాంతరాలు దాసిగా అయ్యి, చివరిలో పదవిని పొందితే, ఏమైనట్లు! దీనికన్నా ప్రజలకు చాలా ధనం లభిస్తుంది. వారెవ్వరికీ దాస-దాసీలుగా అవ్వరు. ఇవన్నీ అర్థం చేసుకోవాల్సిన విషయాలు. ఇకపోతే, ముఖ్యమైన విషయాన్నే తండ్రి అర్థం చేయిస్తారు, వైష్ణవ దేవినే లక్ష్మిగా అవుతారు. లక్ష్మి మందిరం పెద్దదా లేక వైష్ణవ దేవి మందిరం పెద్దదా? ఎవరి మహిమ గొప్పది? వారు జ్ఞాన-జ్ఞానేశ్వరి. లక్ష్మిని జ్ఞాన-జ్ఞానేశ్వరి అని అనరు, అందుకే మహిమ జగదంబది. పెద్ద మేళా కూడా వారిదే జరుగుతుంది. లక్ష్మిని దీపావళి నాడు పిలుస్తారు. ఇది పరమాత్మతో పాటు ఆత్మల మేళా. ఈ విషయాలను మనుష్యులు ఎవరూ అర్థం చేసుకోరు. అర్థం చేయించేవారు చాలా తెలివైనవారై ఉండాలి. వారు యుక్తితో, ప్రేమతో పని నడపాలి. ఎవరైనా సరే, వీరు నిజమే తెలియజేస్తున్నారని వినేవారికి అర్థమవ్వాలి. శ్రీలక్ష్మి ఎంత సుందరంగా ఉండేవారు! లక్ష్మి-నారాయణులు, ఎవరికైతే ఇంత పూజ జరుగుతుందో, వారు కూడా పక్కా వైష్ణవులు. జగదంబ కూడా వైష్ణవ్. తండ్రి వారికి రాజయోగాన్ని నేర్పించి మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేసారు. మీ పూజ ఇప్పుడు జరగజాలదు, ఎందుకంటే శరీరమైతే పవిత్రంగా లేదు. మీరు సంపూర్ణంగా అయినట్లయితే, మీ శరీరం మారిపోతుంది, అప్పుడు మీరు పూజకు యోగ్యులుగా అవుతారు. వాస్తవానికి సన్యాసులను పూజించకూడదు. ఈ రోజుల్లోనైతే శివోహమ్ అని అంటూ కూర్చొని పూజలు చేయించుకుంటారు. వారిలో కూడా ఒక మఠం ఉంది, వారు తమ పూజను చేయించుకోరు. ఇప్పుడు శివుడైతే నిరాకారుడు. వారు తమ పూజను ఎలా చేయించుకుంటారు. చూడండి, శివబాబా వీరిలోకి వచ్చినప్పుడు తమ పూజను ఏమైనా చేయించుకుంటారా. తండ్రి అయితే వచ్చి పూజారుల నుండి పూజ్యులుగా తయారుచేస్తారు, పూజలు చేయడం ఎలా నేర్పిస్తారు! శివబాబా ఏమీ చేయనివ్వరు. నోటి ద్వారా రామ-రామ అని కూడా అనకండి అని అంటారు. కేవలం తండ్రిని స్మృతి చేయాలి. స్మృతి చేయడం అనగా జపించడమేమీ కాదు. పిల్లలు తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటారు. పిల్లలు ఏమైనా తండ్రి జపాన్ని జపిస్తారా. మీరు కూడా జపాన్ని జపించకూడదు. జపానికి మరియు స్మృతికి రాత్రికి-పగలుకు ఉన్నంత వ్యత్యాసముంది. అర్థం చేయించేందుకు పాయింట్లు అయితే కొత్త కొత్తవి ఎన్నో లభిస్తూ ఉంటాయి. వీరు కూడా తండ్రి, ఈ విషయం కూడా అవసరమైనది. వీరి నుండి అనంతమైన వారసత్వం లభిస్తుంది మరియు లౌకిక తండ్రి నుండి హద్దు వారసత్వం లభిస్తుంది. ఈ పారలౌకిక తండ్రి కల్పక్రితం కూడా వారసత్వాన్ని ఇచ్చారు, ఇప్పుడు మళ్ళీ ఇవ్వడానికి వచ్చారు. బుద్ధిలో మొత్తం జ్ఞానమంతా తిరుగుతూ ఉండాలి, దీని ద్వారా మనుష్యులు దేవతలుగా అయిపోవాలి. చూడండి, జ్ఞాన మార్గంలో అర్థం చేయించేందుకు చాలా శ్రమించాలి. దీని వలన మనుష్యుల జీవితము వజ్రం వలె అయిపోవాలి.

చాలామంది దుఃఖితులుగా ఉన్నారు, పరస్పరంలో కొట్లాడుకుంటూ ఉంటారు. తండ్రి వచ్చి ఈశ్వరీయ సంప్రదాయాన్ని తయారుచేసి, మళ్ళీ దైవీ సంప్రదాయాన్ని తయారుచేస్తారు. కనుక గొడవలు-కొట్లాటల విషయమే లేదు. ఈశ్వరీయ దర్బారులో ఆసురీ వ్యక్తి ఎవ్వరూ ఉండజాలరు. మురికి వస్త్రాలకు ఇక్కడ కూర్చునేందుకు అనుమతి లేదు. తండ్రి అర్థం చేయిస్తూ ఉంటారు, పిల్లలూ! ఎప్పుడూ పరస్పరంలో గొడవపడడం-కొట్లాడుకోవడం చేయకూడదు. సద్గురువుకు నింద తీసుకువచ్చేవారు ఉన్నత స్థానాన్ని, ఉన్నత పదవిని పొందలేరు అనగా సత్యయుగంలో ఉన్నత పదవిని పొందలేరు. సద్గురువు, ఎవరైతే స్వర్గానికి యజమానులుగా చేస్తారో, వారిని నిందించినట్లయితే ఉన్నత పదవిని పొందలేరు. ఇదంతా ఇక్కడి విషయమే. కానీ ఆ గురువులు తమ గురించి అని చెప్పుకుంటూ మనుష్యులను భయపెడుతూ ఉంటారు. ఇక్కడైతే పూర్తిగా పవిత్రులుగా అవ్వాలి. వారు గురువులను ఆశ్రయిస్తారు కానీ పవిత్రులుగా అవ్వరు. గృహస్థులను గురువులుగా చేసుకోవడం వలన ఏ లాభము ఉండదు. ఇది ప్రజా రాజ్యము, తర్వాత దైవీ రాజ్యాన్ని తయారుచేసే సమర్థులు కావాలి. ఆసురీ ప్రపంచాన్ని దైవీ ప్రపంచంగా తయారుచేయడానికి బాబా వచ్చారు. దైవీ ధర్మం స్థాపనవుతుంది, మిగిలిన ధర్మాల వారందరూ సమాప్తమైపోతారు. భగవంతుడు వచ్చి ఫలాన్ని ఇస్తారని అంటారు. దీని ద్వారా, ఎవ్వరూ నిర్వాణధామానికి వెళ్ళలేరని ఋజువు అవుతుంది. తండ్రే వచ్చి రాజయోగాన్ని నేర్పిస్తారు. తండ్రి అంటారు, నేను మీ పరమపిత పరమాత్మను. నాలోనే మొత్తం జ్ఞానమంతా ఉంది. నన్నే పతితపావనుడని అంటారు. నేనే మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. మీరు ఇతరులకు నేర్పించాలి. అర్థం చేయించేవారు అందరూ ఒకే విధంగా లేరు. మీరు నోట్ చేసుకోవాలి. బాగా భాషణ చేసేవారికి కూడా అన్ని పాయింట్లు ఆ సమయంలో గుర్తుకు రావు. ఈ పాయింటు వినిపించాలని అనుకున్నానే అని ఆ తర్వాత ఆలోచన వస్తుంది. తప్పకుండా నోట్ చేసుకోవాలి. అలాగని నోట్ చేసుకుని, తర్వాత చదవకుండా వదిలేయడం కాదు. ఎప్పుడైతే శ్రీమతంపై నడుస్తారో, అప్పుడు ధారణ జరుగుతుంది. ఉదయం అమృతవేళ లేచి, బాబాను తప్పకుండా స్మృతి చేయాలి. తర్వాత పాయింట్లను రిపీట్ చేయాలి, ఇతరులకు వినిపించాలి, అప్పుడు ఉన్నత పదవిని పొందుతారు. రాజుగా అవ్వడమంటే పిన్నమ్మ ఇల్లు అంత సులువేమీ కాదు. అర్థమయిందా. కష్టపడాలి. అచ్చా!

మధురాతి మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పూజ్యులుగా అయ్యేందుకు పూర్తి పురుషార్థం చేయాలి. తమ పూజ చేయించుకోకూడదు. ఆత్మ మరియు శరీరము, రెండూ పవిత్రంగా ఉన్నప్పుడే పూజకు యోగ్యులుగా అవుతారు.

2. తెలివితో వివేకవంతులుగా అయ్యి కళ్యాణ భావనను ఉంచుకొని సేవ చేయాలి. దైవీ గుణాలు గల సత్యమైన వైష్ణవులుగా అవ్వాలి.

వరదానము:- పరమాత్మ ప్రేమలో ధరణి యొక్క ఆకర్షణ నుండి పైకి ఎగిరే మాయాప్రూఫ్ భవ

పరమాత్మ ప్రేమ ధరణి యొక్క ఆకర్షణ నుండి పైకి ఎగిరే సాధనము. ఎవరైతే ధరణి అనగా దేహాభిమానం యొక్క ఆకర్షణ నుండి పైన ఉంటారో, వారిని మాయ తనవైపుకు ఆకర్షించలేదు. ఎంత ఆకర్షించే రూపమైనా సరే, మాయ యొక్క ఆకర్షణ ఎగిరే కళలో ఉన్న మీ వద్దకు చేరుకోలేదు. ఎలాగైతే రాకెట్ ధరణి యొక్క ఆకర్షణకు అతీతమైపోతుందో, అలా మీరు కూడా అతీతమైపోండి, దీనికి విధి ఏమిటంటే, అతీతంగా అవ్వడము మరియు ఒక్క తండ్రి ప్రేమలో లీనమై ఉండడము - దీనితో మాయాప్రూఫ్ గా అవుతారు.

స్లోగన్:- స్వస్థితిని ఎంత శక్తిశాలిగా చేసుకోండి అంటే, పరిస్థితులు దానిని కింద-మీద చేయలేకపోవాలి.

అమూల్యమైన జ్ఞాన రత్నాలు - (దాదీల పాత డైరీల నుండి)

జ్ఞానమే సంతోషం యొక్క పునాది అనగా కాండము, ఈ పునాదిపైనే మొత్తం జీవితం రూపీ వృక్షము ఆధారపడి ఉంది. ఒకవేళ పునాది పక్కాగా లేకపోతే, ఆ సంతోషం అల్పకాలికంగా మాత్రమే ఉంటుంది. మాయావి మనుష్యులు, మేము

సంతోషంగా ఉన్నాము ఎందుకంటే మా వద్ద ధనం, వస్తువులు అన్నీ ఉన్నాయి అని భావిస్తారు. కానీ, వారికి సదా కోసం స్థిరమైన సంతోషం ఉండదని మనకు తెలుసు ఎందుకంటే వారి వద్ద జ్ఞానం యొక్క పునాదే లేదు. ఇది ఎలా ఉందంటే, ఎవరైనా షావుకారు ఏదైనా పండులోని సారమంతటినీ తాను తినేసి, దాని తొక్కను పాడేసారనుకోండి, ఆ తొక్కను ఎవరైనా పేదవారు తీసుకొని, నా వద్ద కూడా పండు ఉందని దానిని చూసి సంతోషిస్తారు, కానీ వాస్తవానికి ఆ పండును యజమాని తినేస్తాడు. అలా, మనం ఈ అల్పకాలికమైన మాయావీ సుఖాలను తుచ్ఛంగా భావించి, ఈ అవినాశీ జ్ఞానంతో స్థిరమైన ఈశ్వరీయ అతీంద్రియ సుఖాన్ని ప్రాప్తి చేసుకుంటున్నాము మరియు వారు అల్పకాలికమైన క్షణభంగుర సుఖాన్నిచ్చే మాయను, దేనిలోనైతే వాస్తవానికి ఏ సుఖము లేదో, దాని వెనుక పడి, దాని రసాన్ని అస్వాదిస్తూ, అందులోనే సుఖముందని భావించి కూర్చొన్నారు మరియు నా వద్ద కూడా పండు ఉందనే అహంకారంలో ఉంటారు. అచ్ఛా - ఓంశాంతి.